క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండ లపరిధిలోని సిమెంట్ నగర్ గ్రామం 29వ క్లస్టర్ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామలమ్మ భర్త రామకృష్ణ అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను సర్పంచ్ ఏస్తేరమ్మ అందజేశారు. కార్యక్రమంలో 1, 2 గ్రామ సచివాలయ సిబ్బంది ఈశ్వరన్న, రాజేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప మల్లికార్జునస్వామి ఉత్సవాలు



బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో వెలసిన బీరప్ప మల్లికార్జునస్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతాయని గ్రామస్తులు తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. రాత్రి డోలు వాయిద్యాలు, గురువయ్యల నాట్యాల మధ్య కళశ పూజ నిర్వహించి బీరప్ప మల్లికార్జున స్వామిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు.

శాలివాహన చక్రవర్తి జయంతి



శాలివాహన చక్రవర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని నాగులకట్ట వీధిలోని శ్రీరామాలయంలో కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం శాలివాహన చక్రవర్తి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ నిరుపేద కుమ్మరి కులంలో పుట్టిన వాలివాహన చక్రవర్తి దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన మహావీరుడుగా కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శివరామ మద్దిలేటి, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ దస్తగిరి, బాబాయ్య, లక్ష్మన్న, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతుదొడ్డిలో బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న వృషభరాజములు

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. గ్రామస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో గొడ్డుమూరి హనుమంతు వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ. 5,016 గెలుపొందాయి. అదేవిధంగా రెండవ, మూడవ, నాల్గవ స్థానాల్లో మారెన్న, చంద్రన్న, హనుమంతు వృషభాలు నిలిచి వరుసగా రూ. 4,016, రూ.3016, రూ. 2,016 చొప్పున గెలుచుకున్నాయి.

సర్వదేవతల నిలయం గోమాత



గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సర్వదేవతల నిలయం గోమాత అని గ్రూప్‌దేవాలయాల మాజీ చైర్మన్లు ఈవీ సుజాత శర్మ, గుండా జగన్ మోహన్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో వికాసభారతి, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీకాంత్ మంత్రాలు చదువుతుండగా మహిళలు సామూహిక గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, మారుతి కృష్ణ, నాగమోహన్, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, భజన కృష్ణయ్య పాల్గొన్నారు.

25న రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు

బనగానపల్లెరూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉగాది సందర్భంగా ఈ నెల 25న రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేత జట్లకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు.



కుంటెమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న అర్చకులు



స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



సుంకులమ్మగుడి వద్ద భక్తుల సందడి

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉగాది పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శోభకృత్‌నామ సంవత్సరం అన్ని విధాల కలిసి రావాలని కోరుతూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని సుంకులమ్మ, మారెమ్మ, పెద్దమ్మ, పట్టణ శివారులోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే మండలంలోని జోళదరాశి, కలుగొట్ల, సౌదరదిన్నె, అమడాల, బిజనవేముల, లింగాల, గుళ్లదూర్తి, తదితర గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలను చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కొలిమిగుండ్ల: తెలుగు ప్రజల తొలి తెలుగు పర్వదినం ఉగాది పండుగను బుధవారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శోభకృత్ నామ ఉగాది సందర్భంగా ప్రతి ఇంటి ముందు మహిళలు రంగు రంగుల హరివిల్లులతో అందంగా అలంకరించారు. పల్లెలోని గ్రామదేవతలు పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, చౌడేశ్వరి దేవి తదితర అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల ఎస్సీ కాలనీలోని కుంటెమ్మ ఆలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు పోటెత్తారు. కోటపాడులో చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవం నిర్వహించారు.

బనగానపల్లెరూరల్: శోభకృత్‌నామ తెలుగు నూతన సంవంత్సరం ఉగాది పండుగ వేడులకు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులతో శివాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని భానుముక్కలలోని పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, సుంకులమ్మ గుడిలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, నూతన వస్త్రాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ పంచాంగప్రణం, అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గథంశెట్టి రవికుమార్, ప్రధాన కార్యదర్శి బింగిమళ్ల హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవుడి గ్రామోత్సవం

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో ఉగాది వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. స్థానిక శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకీలో ఆశీనులుగావించి గ్రామోత్సవం నిర్వహించారు. రాజావీధి గుండా స్వామివారిని మండపం వీధి వరకు తీసుకెళ్లారు. దారి పొడూనా భక్తులు స్వామివారికి పూజలు చేశారు. అలాగే సాయంత్రం పట్టణంలోని మూలమ్మ, ఎల్లమ్మ, కోటవీధి పెద్దమ్మ, మారెమ్మ, జమ్ములమ్మ, కుంటెమ్మ అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.



పాటిమీద ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

కిటకిటలాడిన ఆలయాలు



బేతంచెర్లలో సుంకులాపరమేశ్వరి అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

డోన్ టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించుకున్నారు. శోభకృత్‌నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతూ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లలో పూజల అనంతరం గ్రామ దేవతలతో పాటు ఈశ్వరుడు, ఆంజనేయస్వామి, శ్రీరాముల దేవాలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఉగాది పచ్చడి ఇంటిల్లిపాది ప్రసాదంగా స్వీకరించారు. సాయిత్రం పాతపేట రాముల దేవాలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. సుఖ సంతోషాలకు నిలయమైన ఈ సంవత్సరంగా అందరు సఖసంతోషాలతో ఉంటారని వేదపండితులు చెప్పారు.

బేతంచెర్ల: మండలంలో తెలుగు సంవత్సరాది అయ్యేన శోభకృత్ నామ ఉగాది వేడుకలను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం యువకులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇంటి గుమ్మాలను మామిడితోరణాలతో అలంకరించారు. రైతులు వేకువజామునే వృషభరాజములను అలంకరించి పూజలు చేశారు. భూమాతకు పూజలు నిర్వహించి పొలం పనులు చేపట్టారు. అలాగే గ్రామదేవతలైన మారెమ్మ, సుంకలమ్మ, పెద్దమ్మతోపాటు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి, కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీదేవి, సుంకులాపరమేశ్వరీదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్యాపిలి: మండల ప్రజలు ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శోభకృత్ నామనూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.



వెంకటాపురంలోని గద్దెరాళ్ల మారెమ్మ దేవతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



రాములదేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయాల్లో పంచాంగ శ్రవణం



శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శోభకృత్‌నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ వేడుకలను బుధవా రం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ వేదపండితులు జ్వాళా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి పంచాంగ శ్రవణం వినిపించారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పట్టణ ప్రముఖుల ఈవీ సుజాత శర్మ, గుండా జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.

మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు గ్రామస్తుల సౌకార్యర్థం నూతనంగా రెండు రచ్చకట్టలను సొంత నిధులు వెచ్చించి నిర్మించారు. ఉగాది పండుగ రోజు బుధవారం మొదటి సారిగా పంచాంగశ్రవణాన్ని వేదపండితులు రామకృష్ణ శర్మ, చంద్రమౌళిశ్వర శర్మలు రచ్చకట్టలపై నిర్వహించారు. ఆయా రాశులవారీగా శుభ ఫలితాలు, ఈ ఏడాది పంటల సాగు, మార్కెట్లో ధరలు తదితర విషయాలను పండితులు రైతులకు వివరించారు.



రాములదేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

కోవెలకుంట్ల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక సంకులమ్మ ఆలయ సమీపంలో బుధవారం నిర్వహించిన ఒంటెద్దుబండి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన ఎనిమిది వృషభాలు పాల్గొన్న పోటీలను మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. నాసారి సిద్ధయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నిర్ణీత పది నిమిషాల వ్యవధిలో పట్టణానికి చెందిన సూర్యతేజ వృషభం అత్యధిక దూరంలాగి ప్రథమ స్థానంలో రూ. 6వేలు, ధనుంజయుడి వృషభం ద్వితీయస్థానంలో రూ. 5వేలు కైవసం చేసుకున్నాయి. తర్వాతి మూడు స్థానాల్లో పుల్లయ్య, పెద్దయ్య, యోహాన్ వృషభాలు నిలిచి రూ. 4వేలు, రూ. 3వేలు, రూ. 2వేలు దక్కించుకున్నాయి.



రాతిదూలాన్ని లాగుతున్న ఒంటెద్దు

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ

బేతంచెర్ల: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో బుధవారం ఉగాది పండుగను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ శోభకృతునామ తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను మండల ఉపాధ్యాక్షుడు ఆపతి మద్దయ్య, పట్టణ అధ్యక్షుడు బుగ్గన మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు మారుతి శర్మ, హుసేన్‌రెడ్డి, పుల్లారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నాగ మోహన్, శ్రీను, వెంకటేశ్వర్లు, అజయ్ ఆవిష్కరించారు. ప్రపంచ దేశాలకు ఆదర్శమైన మనసంస్కృతి, సంప్రాదాయాల పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తుందని వీహెచ్‌పీ నంద్యాల జిల్లా ఉపాధ్యాక్షుడు బుగ్గన చంద్ర మౌళీశ్వర్ రెడ్డి తెలిపారు.



విశ్వహిందూ పరిషత్ తెలుగు క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాధిత కార్మికుడికి ఆర్థిక సాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యుడు దూదేకుల పీరా కాలికి గాయం కావడంతో వైద్యులు మోకాలి వరకు కాలు తొలగించారు. ఈ మేరకు బుధవారం సభ్యుల సహకారంతో అసోసియేయషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య చంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి బాధిత కార్మికుడికి రూ. 18వేలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు, శేషిరెడ్డి, శివకుమార్, విశ్వనాథ్, మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం కానాల గ్రామంలో వెలసిన సుంకులమ్మ తిరునాలను పురష్కరించుకుని గురువారం రాష్టస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. న్యూకేటగిరి విభాగం రాతిదూలం లాగుడు పోటీల్లో విజేతగా నిలిచిన వృషభరాజముల యజమాన్యాలకు ప్రథమ బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 40వేలు, రూ. 35 వేలు అందజేస్తామన్నారు. తర్వాత స్థానాలకు రూ. 25వేలు, రూ. 20వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

మహానందిలో ఉగాది మహోత్సవ పూజలు

మహానంది: ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామివార్లకు పీఠార్చన, రుద్రాభిషేకం, ఖడ్గమాలార్చన పూజలు వైభవంగా జరిగాయి. అంతకు ముందు గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ మూర్తులకు తిరుమంజనం చేసి నింబకుసుమ భక్షణ నివేదించారు.నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి కుటుంబ సమేతంగా మహానందికి చేరుకుని మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

తరలివస్తున్న కన్నడిగులు

శ్రీశైలంలో రథోత్సవం అనంతరం కన్నడ భక్తులు లక్షలాది సంఖ్యలో మహానందికి తరలిరావడం ఆనవాయితీ. అందులో భాగంగా వేలాది సంఖ్యలో భక్తులకు మహానందికి చేరుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తులరద్దీ కొనసాగింది. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ జి.రవీంద్ర, మహానంది, బండిఆత్మకూరు ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, బాబు, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఐకమత్యంగా మెలగాలి

అవుకు: గ్రామస్తులు ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే ఎలాంటి సమస్యలు తలెత్తవని ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చెర్లోపల్లెలో మే నెలలో గ్రామపెద్దలు బొడ్రారాయి స్థాపించే కార్యక్రమం చేపట్టదలిచిన నేపథ్యంలో బుధవారం ఆ గ్రామాన్ని ఎస్‌ఐ సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన కార్యక్రమాలు పార్టీలు, వర్గాలకు అతీతంగా ఐకమత్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. బొడ్రాయి స్థాపన విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరూ ఆటంకం కలిగించినా ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, గ్రామపెద్దలు చిన్న కంబగిరిస్వామి, సుబ్రహ్మణ్యం శెట్టి, శేషఫణి శెట్టి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి



వెంకటాపురంలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



పెండేకంటినగర్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



జిల్లెల్లలో రూ.20లక్షలతో నిర్మించిన రోడ్డు

సీసీ రోడ్లు కళకళ !

బనగానపల్లె: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని ప్రధాన రోడ్లతోపాటు పొలాల రహదారులను నిర్మిస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాల్లోను కాలనీల్లో సీసీ రోడ్లను నిర్మిస్తుంది. గ్రామీణ ప్రాంతాలను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేకించి వర్షాకాలం వారి బాధలు వర్ణనాతీతం. ఈ సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బనగానపల్లె నియోజకవర్గంలో గత మూడున్నరేళ్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు చేపట్టిన సీసీ రోడ్ల పనులు చాలా గ్రామాల్లో పూర్తయ్యాయి. మరి కొన్ని ప్రాంతాల్లో వివిధ దశల్లో జరుగుతున్న పనులు ఏప్రిల్ 15లోపు పూర్తవుతాయని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. కాలనీల్లో గుంతలమయమైన రోడ్లు నేడు కళకళలాడుతున్నాయి. దీంతో ప్రజలు ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



చెరువుపల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



టంగుటూరులో శివాలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డు

స్ఫూర్తి సేవలకు ఉగాది పురస్కారం

డోన్ టౌన్: మానవ సేవయే మాధవ సేవగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న స్ఫూర్తి సేవా సమితికి కర్నూలుకు చెందిన విజ్ఞాన సేవా సమితి ఉగాది పుస్కారాన్ని అందజేసింది. కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన ఉగాది మహోత్సవ సభలో స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు సీసీంగుంతల ఆలా మధుకు పురస్కారం అందజేసి శాలువతో సత్కరించారు.

కొనసాగిన నిరసనలు

డోన్ టౌన్: జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరసనలు బుధవారం కొనసాగాయి. మొదటి సర్వీసుకు వచ్చిన కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక డిపో ఎదుట నిరసన తెలిపారు. పీఆర్సీ బకాయిలు, డీఏ అలవెన్స్‌లు చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఐవీఆర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు శ్రీనివాసులు, అక్బర్, చంద్ర, అలీసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.